

# గార్డు

భారు నరహరిరావు

గట్టిగా విజిల్ వూదాడు గార్డు. అంతా రైలు ఎక్కి హడావుడిలో మునిగారు. రైలు పెద్దగా కూత పెట్టింది. సిగ్నలు పైకి లేచింది వెళ్ళమన్నట్టు. గార్డు తన చేతిలోకి పచ్చజెండ తీసుకున్నాడు.

"మల్లెపువ్వుల్"! అరుస్తున్నాడో వ్యాపారస్తుడు

రైలు ఇంజను కూత ఆపినా ఏదో శబ్దం చేస్తూనేవుంది.

ఒక ముసలావిడ గబగబా నడుస్తూ గార్డు దగ్గరిగా వచ్చింది. అతను ఆవిడ వైపు చూశాడు.

"చూడండి బాబు, నా కూతురును ఇక్కడి దాకా తెచ్చారు. ఓ రెండు నిమిషాలు రైలునాపండి, దాన్ని వెంటనే బెజవాడ ఆసుపత్రికి తీసుకెళ్ళకుంటె చచ్చిపోతుంది. దాన్ని రక్షించండి బాబు." అన్నది కన్నీళ్ళు తుడుచు కుంటూ. గార్డు ఆవిడవైపు చూశాడు.

దాదాపు యాభై సంవత్సరాలు వుంటాయి. ఆవిడ చూడటానికి సంస్కారయుతంగానే వుంది. కూతురి ప్రాణాల కోసం తాపత్రయపడుతున్నట్లు న్నాయి ఆవిడ మొహంలోని భావలు.

దూరంగా ఒక మంచాన్ని మోసుకొస్తున్న నలుగురు వ్యక్తులు కంటపడ్డారు గార్డుకు. వారు స్టేషనుకు జేరటానికి కనీసం అయిదు నిముషాలైనా పడుతుంది. అంతవరకు రైలు నాపాలి. అతను ఆలోచించాడు.

రైలు పెద్దగా కూతపెట్టింది.

"బాబూ!" అందావిడ జాలిగా.

అతను నిశ్శబ్దంగా వుండిపోయాడు.

ఐదు నిముషాలు గడిచిపోయాయి.

మంచంతో ఆ వ్యక్తులు స్టేషన్‌లోకి అడుగు పెట్టారు. ఆవిడ తన కూతురున్న మంచంతో రైలెక్కింది.

గార్డు విజిల్ వూది పచ్చజెండా వూపేడు.

ఇంజన్ పెద్దగా కూతపెట్టి ముందుకు కదిలింది.

గార్డు తన డబ్బా ఎక్కాడు.

స్టేషన్ దాటగానే పచ్చజెండా రెండవసారి చూపి తన సీటుపై కూర్చున్నాడు. ప్రక్కన కిటికి పచ్చని వరిచేలను వెనక్కి తోస్తూంది. అతని ఆలోచనలు పరిపరి విధాల పోతున్నాయి.

రైలు వేగాన్ని అందుకుంది.

సీతను అంతగా ప్రేమించాడు మరి!

అందుకే తను ఇంతవరకు బ్రహ్మచారిగానే వుండిపోయాడు.

సీతా తను ఎంతో ప్రేమగా వుండేవరు. ఒక్కరోజు సీతతో ఆడకపోతే ఏదో వెలితిగా అనిపించేది తనకు. సీత తనంటె ప్రాణం విడుచుకొనేది. తమ ఇంట్లో ఏది చేసుకున్నా తనకు ఇవ్వందే తినేది కాదు. ఇద్దరూ తమ ఇంట్లోని నులక మంచం వెనుక కూర్చొని తెచ్చుకున్నది పంచుకొని తినేవారు.

తనూ, సీతా, బొమ్మలాటలు ఆడితే నులక మంచం ఇల్లుగా చేసుకునేవారు. గోడకు దగ్గరిగా మంచాన్ని జరిపి దానిపై దుప్పటి గప్పి వెనుక కూర్చొని ఆడుకునే వారు.

వర్షం పడినప్పుడు ఇద్దరి ఆనందానికి అవధులు ఉండకపోయేవి. వర్షంలో తడుస్తూ గెంతుతూ ఆడేవారు. ఇంటి పెరట్లో కాల్వలు కట్టి నీటిలో కాగితపు పడవలు చేసుకొని పందాలు పెట్టుకొని ఆడుకునే వారు. పడవల పందాల్లో ఎప్పుడు తనే గెల్చేవాడు. సీతకు కోపం వచ్చేది. తను సర్ది చెబుతూండేవాడు.

ఆనందంగా గడచిపోయేవి రోజులు.

ఒక రోజు తనూ సీత ఊరవతలి గుడిలో కెళ్ళి మంటపంపై కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు. మాటల సందర్భంలో తనన్నాడు. "సీతా నన్ను పెళ్ళి చేసుకుంటావా?" అని. ఆ వయసులో దాని అర్థం తెలియకున్నా ఎక్కడో విన్న మాటలు పట్టుకొని అన్నాడు.

"ఊఁ", అంది సీత.

"నేను పెద్దయ్యాక రైలు గార్డునై దేశ దేశాలు తిప్పుతాను వస్తావా?" అంటూ అడిగాడు.

"ఓ, తప్పకుండా." అంది రెండు జడల సీత.

అప్పట్లో తనకు సీతకు గార్డు అంటె రైలు స్వంతదారని, అతను చెప్పినట్లు రైలు నడుస్తుంది

కాబట్టి. అయినా గొప్పవాడని మాత్రమే తెలుసు, కాని అది ఎంత శ్రమతో కూడుకున్న పనో తెలిసేది కాదు.

ఇద్దరూ రోజు గుడికెళ్ళి ఎన్నో కబుర్లు చెప్పుకునేవారు. తనవారు గాని, సీత తల్లిగాని తమకున్న సన్నిహితాన్ని ఏనాడూ కాదనలేదు. ఇద్దరి హృదయాల్లో ఎన్నో సంఘటనలు, భావాలు పెనవేసుకొని మరింత దగ్గరికి చేర్చేవి.

రోజులు గడిచిన కొద్దీ ఇద్దరు మరింత దగ్గరైయ్యారు.

తను పల్లెలోని స్కూల్ ఫైనలు పాసుకాగానే పై చదువులకని పట్నం వెళ్ళాల్సిన రోజు సీత ఎంతో బాధ పడింది.

"నీవు వచ్చేదాకా నీకోసం ఎదురు చూస్తూంటాను." అంది, ఇంటి గుమ్మందాకా వచ్చి సాగనంపుతు. తను సీతను వదల్లేక వెళ్ళిపోయాడు. కాని కొన్ని రోజులు ఏదో పోగొట్టుకున్న వాడిలా బాధపడేవాడు. ఎక్కడ చూసినా సీతే కనబడేది.

"నన్ను మరిచిపోవుగా?" అని బాధగా అన్న సీత మాటలు మరచిపోలేక పోయాడు. సీతను ఊహించుకుంటు రెండు సంవత్సరాలు దూరంగా వున్న పట్నంలో గడిపేశాడు. సీతగూర్చి తల్లి అప్పుడప్పుడు వ్రాసేది. తల్లి వ్రాసిన అక్షరాలను పదేపదే చదివి సీత రూపం వూహించుకునేవాడు. తను లాగూలు వేసుకున్నప్పుడు పరికిణి జాకెట్టులో ఉన్న సీత తను వచ్చేప్పుడు ఓణీలు వేసుకొనేది. కాని ఇప్పుడు?!!?

బహుశా చీరలు కట్టుకొని అందంగా వుండి వుంటుంది. కాలేజీలో ఎంత మంది అమ్మాయిల్ని చూసినా సీతకు సాటి ఎవరూలేరని అనుకునేవాడు. చదువు పూర్తికాగానే సీతకోసం వందరూపాయలు ఖర్చుపెట్టి చీరలు జాకెట్లు తీసుకొన్నాడు. గడచిన రెండు సంవత్సరాలు త్వరగా గడిచాయనిపించింది. అదంతా సీతను ఊహిస్తూనే గడిపేశాడు.

రైలు ఊరి దగ్గరవుతున్న కొద్దీ తన గుండె వేగంగా కొట్టుకోసాగింది. సీత ఇప్పుడు యువ్వనంలో ఉండి వుంటుంది. చిన్నప్పుడే ఎంతో అందంగా వుండే సీత ఇప్పుడింకెంత అందంగా వుండి ఉంటుందో? ఇదే తన వూహా అప్పట్లో!!

రైలు దిగగానే వూరంతా క్రొత్తగా మారిపోయింది. స్టేషన్ దగ్గర ఒకటి రెండు హోటళ్ళు ఉండేవి, కాని ఇప్పుడు? ఎనిమిది హోటళ్ళు వచ్చాయి.

సూట్‌కేసుతో ఇంటివైపు నడిచాడు తను. ఊరు కుగ్రామమే అయినా మూడు సంవత్సరాలలో ఎంతో మారిపోయింది. దారి కిరుప్రక్కలా క్రొత్త గుడిసెలు వెలిశాయి.

గతుకుల రోడ్డు వెడల్పుగా సాఫీగా ఉంది. దూరంగా సినిమా పాటలు పెద్దగా వినబడుతున్నాయి. బహుశా ఎవరిదైనా పెళ్ళి కాబోలు. కరెంటు వచ్చిన తరువాత ఊరి కళే మారి ఉంటుందని వూహించాడు తను.

ఇంటికి జేరి ఇంట్లోని అందర్నీ పరామర్శిస్తూ సీత కోసం చుట్టూ గాలించాడు., సీత ఎంతకీ కనబడక పోయేసరికి తల్లిని పిలిచి అడిగాడు, "అమ్మా సీత రావటం లేదా?" అని.

'నీవు వస్తున్నావని చెప్పాను, కాసేపాగి వస్తుంది' అంది తల్లి. "సీతకోసం తన కళ్ళు వెయ్యిదిక్కులు వెదికాయి. కాని సాయంత్రంవరకు ఓర్చుకున్నా సీత కనబడలేదు.

తన గదిలో కూర్చొని సీత గూర్చి తల్లి వ్రాసిన ఉత్తరాలు చదువుతూండగా తల్లి పిలుపు వినిపించింది.

"సీత వచ్చిందిరా." అంటూ.

గుండె వేగంగా కొట్టుకుంది.

మెల్లిగా వంటింటి వైపు నడిచింది.

సీత!!!!

తల్లి ప్రక్కగా కూర్చున్న సీత చిన్నగా నవ్వుతోంది.

తలుపు దగ్గరే నిలబడిపోయాడు తను. తనను చూడగానే తల వంచుకొని లేచి వెనక్కు తిరిగింది. ఆమెను పిలవాలనుకున్నాడు. కాని పిలువలేకపోయాడు.

ఆమె వెళ్ళిపోయింది.

తను బాధ పడ్డాడు. సీతతో ఏమేమొ మాట్లాడాలనుకున్నాడు. కాని, ఆమె తనను చూసి వెళ్ళిపోయింది. సిగ్గు పడ్డదేమొ తరువాత మాట్లాడవచ్చు అనుకొని ఊరుకున్నాడు.

* * *

సీత ఎంత అందంగా వుంది!

ఆమె మాట్లాడకుండా వెళ్ళిపోతే తనెంత బాధ పడ్డాడు. అప్పటి సీతలో ఇప్పటి సీతలో ఎంత వైవిధ్యం ఉంది! వోణీలు వేసుకొని " నన్ను మరిచిపోవుగా?" అన్న సీత, చీరలో నిండుగా అందంగా తల వంచుకొని వెళ్ళిపోయిన సీత, ఇద్దరిలో ఎంత తేడా? ఆమెతో మాట్లాడాలనే కుతూహలాన్ని అణుచుకొని పొలాలవైపుగా నడిచాడు.

బాల్యం, యువ్వనం, రెండు దాటితే మానవుడి జీవితం దుర్భరం అవుతుందని తన అభిప్రాయం అందుకే యువ్వనంలోనే అన్నీ అనుభవించాలి. అందుకే పచ్చని పొలాలవైపు నడిచాడు. బాధను మరచి ఆనందంగా వుండాలని.

పచ్చని వరి పొలాలు, దూరంగా రైలు కట్ట, ఆ ప్రక్క తుమ్మలమ్మ చెరువు, ఉత్తరంగాదూరంగా మామిడి తోపులు చూడముచ్చటగా వుందా దృశ్యం.

తను సీతతో మామిడి తోపుల్లో ఆడుకున్న రోజులు తల్చుకుంటె ఇప్పటికీ ఎంతో ఆనందంగా వుంటుంది.

ఎత్తుగా ఎదిగిన జొన్న చేలలో దోసకాయల కోసం వెతుక్కుంటూ దోస తీగల వెంబడి నడుస్తు పెద్ద పెద్ద దోసకాయలు తెంపి తింటూ రకరకాల కథలు చెప్పుకుండేవారు. ఒకసారి సీత చిన్న కథ చెప్పి పెద్దగా నవ్వింది, ఆ కథను జీవితంలో మరచి పోలేడు.

'అనగనగా ఒక ఊళ్ళో ఒక చెట్టుందిట. ఆ చెట్టుపైన ఒక పచ్చటి ఎర్రముక్కు చిలకుందిట. ఆ చిలుకకు ఎన్నో కథలు తెలుసుట. ఒకసారి చిలుక ఎర్రటి మామిడి పండును కొరకబోయి ఒక ఎర్రటి రాతిని పొడిచిందిట. పాపం దాని ముక్కు విరిగిందట. పాపం దాని మొగుడు దాన్ని చూసి "ఛీ, మూతిలేనిదానా, ఫో!" అందిట. అది ఏడుస్తు ఎక్కడికో ఎగిరిపోయిందిట. మరి దాని ముక్కు పోతే దాని మొగుడుకు కోపం ఎందుకొచ్చింది?' అంది సీత అమాయకంగా.

తను నవ్వి ఏమొ నాకేం తెలుసు? అన్నాడు.

ఆ కథలో ఎంత అర్థం దాగుందో కాలేజీలోని కొన్ని సంఘటనలు ఋజువు చేశాయి. అంత చిన్న మెదడులో ఎన్ని ఆలోచనలో! ఆశ్చర్యపోయాడు తను.

అటువంటి సీత సిగ్గుగా వెళ్ళిపోయింది. ఎలాగైనా రేపు మాట్లాడాలి అనుకున్నాడు తను.

ఆ రాత్రి ఎంత ప్రయత్నించినా నిద్దుర పట్టలేదు.

* * *

"సీతా" అన్నాడు మెల్లిగా.

సీత ఆగిపోయింది.

"అంత సిగ్గు పడతావేం?" అడిగాడు తను.

తలవంచుకొని నవ్విందామె.

"చూడూ, నేను నీకు క్రొత్త కాదుగా? అనగనగా ఒక చెట్టుండేదిట. ఆ చెట్టుమీద ఒక పచ్చటి ఎర్రముక్కు చిలకుండేదిట..." చిరునవ్వు నవ్వాడు తను.

సీత మెల్లిగా కళ్ళెత్తి చిరునవ్వుతో తనవైపు చూసింది.

"ఏం సీతా అంత సిగ్గు పడితె ఎలా? నీవు మాట్లాడకుంటె, నాకేం తోచదు. అన్నట్టు సీతా నీ కోసం ఏం తెచ్చానో చూద్దువుగాని రా" అంటూ గబగబా ప్రక్కగదిలోకి నడిచి సూట్‌కేసుతో బైటికివచ్చాడు.

సీత ఎంత తలవంచినా తనని వోరగా చూస్తూండటం తను గమనించాడు. సూట్‌కేసు మూత తెరిచి చూపాడు. అందులో చీరలు జాకెటు గుడ్డలు కనబడ్డాయి. అవన్నీ ఆమె ముందుంచి "సీతా ఇవన్నీ నీకే తీసుకో", అన్నాడు వెనక్కు జరుగుతూ సీత నిశబ్దంగానే అతని వైపు చూసింది.

"ఏం సీతా వద్దా?"

మెల్లిగా తల వంచుకొని నిశ్శబ్దంగా ఉండిపోయింది.

"నాతో మాట్లాడకూడదా?" అడిగాడు తను మూతి ముడ్చుకొని.

మెల్లిగా తలెత్తింది.

"ఐతే తీసుకో" అన్నాడు తనే.

'వద్ద'న్నట్టు తలూపింది.

"ఏం?" అడిగాడు తను.

"అమ్మ......" అంది మెల్లిగా.

"ఏమీ అనదు తీసుకో" అన్నాడు.

అతని కళ్ళలోకి చూసింది.

"తీసుకోకుంటె ఒట్టే" అన్నాడు ఆమె చేతిని పట్టుకుంటూ. సీత కళ్ళల్లో నీరు నిలచింది.

ఆమె పెదవులు వణికాయి.

"సీతా" అన్నాడు తను ఆశ్చర్యంగా.

"మీరెంత మంచివారండి, నేనెంత అదృష్టవంతురాలిని" అంటూ తన దగ్గరిగా జరిగింది.

సీతనోట అనుకోని విధంగా వెలువడ్డ మాట

తను ఆశ్చర్యపోయాడు. ఆమె భుజాల మీద చేతులు వేసి దగ్గరకు తీసుకున్నాడు. సీత నిశబ్దంగా తన ఒడిలో ఒరిగిపోయింది.

లక్ష సంవత్సరాలు చలితో వణికి వెచ్చటి దుప్పటి కప్పుకున్నవాడిలా హాయిగా తృప్తిగా కళ్ళు మూసుకున్నాడు తను. ఆమె నిశ్శబ్దంగా అలాగే వుండిపోయింది.

ఏదో తెలియని ఆనందంలో మునిగిపోయి కళ్ళు మూసుకున్నాడు. గత జీవితంలో పోగొట్టుకున్న వస్తువేదో దొరికినట్లుగా తృప్తి చెందేడు.

'సీతా' అని పిలుపు వినపడగానే మెల్లగా వెనక్కు తప్పుకొని తనకిచ్చిన బహుమానాలతో వాకిట్లోకి నడిచింది సీత.

నెల రోజులు క్షణంలో గడచిపోయాయి. ఒకర్ని విడచి ఒకరు ఉండలేకుండా అయ్యారు. సీత తిరిగి ధైర్యపు పనువు ఏర్పర్చుకున్నది. ఇద్దరూ గత స్మృతులలో రాత్రింబవళ్ళు గడిపేవారు.

తనకు సీతకు ఒక శుభ ముహూర్తాన వివాహం నిశ్చయించారు పెద్దలు. ఆ రోజు తను అనుభవించిన ఆనందం ఇంతక ఎప్పుడూ అనుభవించి ఉండడు.

ఆ విషయం విన్నప్పటినుండి సిగ్గుతో తల వంచుకొని "పొండి", అనే సీతను ఇప్పటికీ ఎప్పటికీ మర్చిపోలేడు తను.

పెళ్ళి విషయం విన్నప్పటి నుండి సీత దగ్గరికి రావటం మానేసింది. తను ఆమెకోసం తాపత్రయ పడేవాడు. ఒక రోజు సీత ఇంటికి రాగానే ఎవరూ చూడకుండా ఆమెను దగ్గరికి తీసుకున్నాడు.

"వదలండి" అంది గింజుకుంటూ.

"సీతా నీవు రాకుంటే మాట్లాడకుంటే ఎంతో బాధగా వుంటుంది. మాట్లాడవా?" అడిగాడు వంగిపోయి ఆమె మొహంలోకి చూస్తూ.

చిరునవ్వుతో కళ్ళు మూసుకొని "ఊఁ!" అంది

# గార్డు

'మాట్లాడుతా', నవ్వుతూ.

"మాట్లాడకుంటే ఒట్టే!" అన్నాడు చిలిపిగా.

"పోండి", అంది, మొహాన చేతులు కప్పుకుంటూ.

"సీతా రేపు దీపావళి, మరి ఏమంటావ్? తిరిగి రేపు పెళ్ళి చేసుకుందామా?" అడిగాడు నవ్వుతూ.

సిగ్గుతో ఆమె బుగ్గలు ఎరుపెక్కాయి.

"ఇదిగో....." తన మాటలు పూర్తికాకుండానే తప్పించుకొని పారిపోయింది సీత.

* * *

దీపావళి రానే వచ్చింది.

భయంకర కాళరాత్రిని పారద్రోలే రంగు వెల్గుల రాత్రి. దీపాల తోరణాలు చీకటనే ప్రకృతి కంఠాన్ని కౌగిలించుకొని దివ్యంగా వెలిగేరోజు.

నల్లటి చీకటిని ప్రమదల్లోని చిన్న దీపాలు వెళ్ళగొట్టే వృధా ప్రయత్నాలు చేస్తున్నాయి.

సీత! తనిచ్చిన ఆకాశం రంగు టెర్లిన్ చీర కట్టుకొని ప్రమిదల్లోని వత్తులకు జ్వాల నందిస్తోంది. తను ఆమె అందాన్ని ప్రమిదల కాంతుల్లో చూస్తున్నాడు.

చిరునవ్వుతో తలవంచుకొని వత్తుల్ని సవరిస్తోంది.

"సీతా", అన్నాడు తను.

"ఊఁ!" అంది చిరునవ్వుతో.

"నీ వెంత అందంగా ఉన్నావో తెలుసా?" అన్నాడు చిరునవ్వుతో.

"పోండి", అంది నవ్వుతూ.

"పోతున్నా, వెళ్ళి చిచ్చుబుడ్డి తెచ్చి కాలుస్తాను. ఆ వెలుగులో నిన్ను....." అంటూ గబగబా గది వైపు నడిచాడు తను.

టపాకాయలు బుట్టనిండా నిండి ఉన్నాయి.

అన్నిటికంటే పెద్దదైన చిచ్చుబుడ్డి తీశాడు. ఇది కక్కే పువ్వుల కాంతిలో సీత! "అబ్బ" అనుకున్నాడు తను.

'కీచు'న వినబడిందేదో శబ్దం క్షణిమంది.

ఉలిక్కి పడ్డాడు తను. అది సీత కంఠం.

"అమ్మో!" అంటూ వినిపించింది అదే కంఠం రెండవసారి.

చిచ్చుబుడ్డి అక్కడే పారవేసి గబగబా వాకిట్లోకి పరిగెత్తాడు తను.

కళ్ళకు కనపడ్డ దృశ్యాన్ని చూసి దిగ్భ్రాంతితో క్షణం నిలబడి గబగబా ముందుకు పరుగెత్తాడు.

సీత టెర్లిన్ చీరకు దీపం అంటుకొని కాలుతోంది. అప్పటికే సగం కాలింది. గబగబా ఆమె దగ్గరికి పరుగెత్తి చీరను బలంగా లాగేశాడు.

సీత స్పృహ తప్పింది.

అంతా పరుగెత్తుకొని వచ్చారు.

సీత బ్రతకాలంటే డాక్టర్ రావాలి. డాక్టర్ తనున్న వూళ్ళో లేడు. పక్క వూరికి వెళ్ళాలి టైం చూసుకున్నాడు తను. రైలు వెళ్తుంది. సీతను మంచంపై పడుకోబెట్టించి నలుగురు వ్యక్తులతో స్టేషన్ వైపు నడిచాడు.

తను ముందుగా స్టేషన్ చేరాడు. తను స్టేషనుకి చేరేసరికి రైలు వచ్చి ఆగి ఉంది. గబగబా టికెట్లు కొన్నాడు. సీత దాదాపుగా స్టేషన్ దాకా తీసుకొని రాబడింది.

రైలు కూత పెట్టింది.

గార్డు పచ్చని దీపం చూపటానికి చేయి ఎత్తాడు. తను గార్డు దగ్గరిగా పరుగెత్తాడు.

"సార్ క్షణం రైలు నాపండి, నా సీతను దక్కించుకోవాలి" అన్నాడు పిచ్చిగా.

"ఇప్పటికే గంటలేటైంది, టైం లేదు." అంటూ విజిల్ వూది పచ్చదీపం చూపాడు.

రైలు కదిలి వెళ్ళిపోయింది. సీత స్టేషన్ చేరేసరికి రైలు సిగ్నలు దాటి వెళ్ళిపోయింది, చీకటి శూన్యంలోకి.

కుమిలి కుమిలి ఏడ్చాడు తను.

కాని, ఆ చీకటి ప్లాట్‌ఫారం మీద మంచంలో వికృతాకారం దాల్చి పడి ఉన్న సీత తన శరీరంచూసి అసహ్యించుకొని కాబోలు ఈ లోకాన్ని వదిలి శూన్యంలో కలిసిపోయింది.

తను ఒంటరిగాడైపోయాడు.

పొలాలు, మామిడి తోపులు, పచ్చని ప్రకృతి వికృతంగా, భయంకరంగా కనబడ్డాయి. ఊరంతా చిన్నబోయినట్లు అనిపించింది.

ఎక్కడ కూర్చున్నా సీతే నవ్వుతూ కనబడేది. అక్కడ ఉండలేక పోయాడు. సీతను కౌగిట్లో ఉంచుకున్న క్షణాలు తల్చుకొని పిచ్చిగా నవ్వుకునేవాడు. కొన్నాళ్ళకు పట్నం వెళ్ళి పరిస్థితుల మూలంగా గార్డు అయ్యాడు. తన ఊరు చేరినప్పుడు కళ్ళల్లో నీరు నిండేది. సీతకోసం కళ్ళు పలుమూలలా వెదికేవి, కాని పిచ్చి కాకుంటే లోకాన్ని వదిలిన సీత ప్లాట్‌ఫారం మీద కనబడ్తుందా?

కాని, ఈ రోజు తన హృదయానికి ఘాతంలా



# గార్డు

[illegible]
అనే పరిస్థితులలో.

అతని ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ. టీ. సీ. రామనాథం భుజం తట్టాడు.

"చూడండి, రైలు ఆగి పది నిమిషాలైంది. ఏమిటండీ పరధ్యానం, గంట లేటును డెబ్భై నిమిషాలు చేశారు. కమాన్ లెట్‌ది ట్రైన్ మూవ్!" అన్నాడు తడూస్తూ.

ఉలిక్కిపడి పరిసరాలు గమనించి నిట్టూర్చి విజిల్ ఊది పచ్చజెండా చూపాడు.

రైలు కదిలింది.

* * *

తన డ్యూటీ అయిపోయినట్టు సంతకం చేసి గబగబా ప్లాట్‌ఫారమ్ దాటి దగ్గర్లో ఉన్న పెద్దాసుపత్రి వైపు నడిచాడు.

ఆసుపత్రి చేరగానే ముసలావిడ గాభరాగా అటూ ఇటూ తిరుగుతోంది. ఆవిడ దగ్గరిగా నడిచాడు.

"ఏమండీ." అన్నాడు మెల్లిగా.

"ఎవరూ?" అందామె గార్డు వంక చూస్తూ.

"నేను" అన్నాడు తనను తిరిగి ఆవిడకు పరిచయం చేసుకుంటూ.

"బాబూ, నా బిడ్డ బ్రతికింది బాబు, అంతా నీ దయే, నీవు ఆ క్షణం రైలునాపకుంటె నా కూతురి జీవితం నాశనం అయ్యేది. నీ ఋణం ఎలా తీర్చుకోవాలో తెలియటం లేదు నాయినా." అందావిడ.

"ఏమైందండీ అమ్మాయికి?" అంటూ ప్రశ్నించాడు అతను.

"అన్నం వండుతూండగా నిప్పంటుకొని ఒళ్ళు కాలింది నాయినా" అందామె బాధగా.

అతను నిశ్శబ్దంగా వుండిపోయాడు.

"బాబూ దాని ఖర్మం చిన్నప్పటి నుండీ ఇలాగే కాలింది, దాని పన్నెండవ ఏటనే తండ్రిపోయారు. దిక్కులేని నా కూతురుకు దాని మేనమామ పెళ్ళి చేశాడు. భర్త మంచివాడే దొరికాడు. నా కూతురి కార్యం కాకుండానే ఆమె భర్త రైలు ప్రమాదంలో మరణించాడు. సాంసారిక సుఖాలకు నోచుకోని నా కూతురు నా దగ్గరే ఉండిపోయింది. దాని భర్త వైపు నుండి దానికి ఏమీ సంక్రమించ లేదు. 'సీతమ్మ' అని పేరు పెట్టుకున్నందుకు ఆ తల్లంత కష్టాలు పడ్తోంది నా కూతురు. పదహారు సంవత్సరాల్ని గడిచింది భర్తపోయి. అటువంటి అనాథను, నా కూతురుపై ఊరి జనం అనవసరంగా లేనిపోని అభాండాలు వేశారు నాయినా."

ముసలావిడ కథకు అతని కళ్ళల్లో నీరునిండింది.

"అది ఇంటి బైటికి రావటానికి కూడా భయపడేది. ఇంట్లోనే కూర్చొని కుమిలి పోయేది."

ఆవిడ కళ్ళల్లోని నీరు బుగ్గల మీదికి దొర్లాయి.

"బాబూ అది కావాలనే చేసిందో లేక ప్రమాదవశానో తెలియదు కాని, దాని ఒళ్ళు కాలిపోయింది, వాడి దయ వల్ల నా కూతురు బ్రతికింది." అందావిడ కన్నీళ్ళు తుడుచుకుంటూ.

గార్డు ఆవిడ వైపు చూస్తూండిపోయాడు.


"నీ వెవరు నాయినా? నాపై ఎందుకింత శ్రద్ధ చూపుతున్నావ్." అంటూ ప్రశ్నించింది?

అతనో నిట్టూర్పు విడిచాడు. "మీ అమ్మాయిని చూడటానికి వచ్చానంటె దానికో పెద్ద "కథుంది." అన్నాడు ఆవిడ వైపు చూస్తూ.

ఏమిటి బాబూ?" అందావిడ.

అతను చెప్పుకొని పోసాగాడు...

* * *




గార్డు!

కొను, తను గార్డు, నేను పెద్దయ్యాక రైలు గార్డునై నిన్ను దేశదేశాలు తిప్పుతాను, వస్తావా? అని తను సీతతో అన్నమాటలు తల్చుకొని బాధపడేవాడు, కాని ఇప్పుడు తన హృదయం తేలిగ్గా వుంది. పోయిన సీత తిరిగి వచ్చినట్టయింది. ఆవిడ తన కథ విని జాలిపడింది. తనకు లేనిది తిరిగి తనకు లభించింది. పాపం! సీత సాంసారిక సుఖాలకు నోచుకోకుండా భర్తను కోల్పోయింది. అటువంటి సీత తన సీతా ఒకే పోలికలో ఉండటం చూసి ఆశ్చర్యపోయాడు తను. అందుకే తల్లికి ఆభ్యంతరం లేకుంటె ఆమెను వివాహం చేసుకుంటానన్నాడు.

ఆ సీత అగ్నిప్రమాదంలో మరణించింది. ఈ సీత అగ్నిలో ప్రవేశించినా తన కోసం బ్రతికింది. ఆమెను చూసి తను పెళ్ళి చేసుకుంటున్నప్పుడు ఆ ముసలి తల్లి ఆనందానికి అవధులు లేకపోయాయి. డిశ్చార్జి రోజువరకు వస్తానని కావలసిన వస్తువుల కోసం బైల్దేరాడతను.

నాలుగువందల ఖర్చుతో బ్రహ్మాండమైన ఇల్లు అద్దెకు తీసుకొని మరో నాలుగు వేలు పెట్టి ఇంటికి కావలసిన వస్తువులు సమకూర్చుకున్నాడు.

లోకం తిరిగి పచ్చని వరిచేలు, అందమైన మావిడి తోపులా గానే కనుపించ సాగింది. సీత తిరిగి వస్తుంది. అదీ అతని ఉత్సాహం.

పనులు పూర్తికానిచ్చే సరికి సీతను డిశ్చార్జ్ చేసే రోజు వచ్చింది, పువ్వులు తీసుకొని సూట్ వేసుకొని ఆసుపత్రి జేరాడతను.

"సార్." నర్సు పిలుపుతో ఆగిపోయాడు. "మీకి ఉత్తరం ఇవ్వమని ఆవిడ ఇచ్చారు" అంటూ, ఓ ఉత్తరం అందించింది నర్సు.

అతను ఉత్తరం మడత విప్పి చదవసాగాడు.

"బాబూ,

నీ వంటి ఉత్తముడు నా కంటబడటం నా అదృష్టం. నీవు నా సీతను పెళ్ళి చేసుకుంటానన్న విషయం దానికి చెప్పిన రోజు ఆనందంతో మూర్ఛపోయింది. అది తేరుకున్నాక నీతో స్వర్గ సుఖాలను ఊహించుకొని వెయ్యి దేవుళ్ళకు నమస్కారాలు పెట్టింది.

బాబూ విధి విచిత్రమైంది. మొన్న తన రూపాన్ని అద్దంలో చూసుకున్న సీత కుమిలి, కుమిలి ఏడ్చింది. నేను నీ గూర్చి, నీ కథను గూర్చి దానికి చెప్పేను. దిగులుతో రెండు రోజులు నిశ్శబ్దంగా వుండిపోయింది.

కానీ బాబూ, నిన్న రాత్రి అది ఏ ఉద్దేశ్యంతో చేసిందో గాని, అది విషం తీసుకొని ఆత్మహత్య చేసుకుంది..."

అతను నిశ్చేష్టుగా నిలబడిపోయాడు. అతని కళ్ళల్లో నీరు నిలచింది.

"సీతా గార్డుగా నిన్ను లోకాలు తిప్పాలని ఊహించాను..."

పిచ్చిగా నవ్వాడు గార్డు.

దూరంగా వినపడ్డ రైలు కూతలో అపహాస్యం ధ్వనించింది.